ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 33.0
కనిష్ఠం 24.2

ANDHRAJYOTHY

నల్లగొండ

5

గురువారం 27 జూన్ 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.20 (122.0338)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.70 (2.71)	78.39	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	నిల్	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.235

డీసీసీబీ చైర్మన్‌పై రేపే అవిశ్వాస ఓటింగ్



నల్లగొండ డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌కు సన్నద్ధమయ్యారు. శుక్రవారం ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో 14 మంది డైరెక్టర్లు తెలంగాణ సహకార చట్టం-1964, సెక్షన్ 34/ఏ ప్రకారం ఈ అవిశ్వాసపు నోటీసులు ఇచ్చారు. ఈ చట్టం నిబంధనల మేరకు ఈ నెల 28న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొనాల్సిందిగా డీసీసీబీ డైరెక్టర్లందరికీ ఇప్పటికే నోటీసులు అందజేశారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- శిబిరంలోనే కాంగ్రెస్ మద్దతు డైరెక్టర్లు
- నేటి రాత్రికి హైదరాబాద్‌కు రానున్న డైరెక్టర్లు
- అమెరికా పర్యటనలో ఉన్న వైస్ చైర్మన్ వచ్చేనా..?
- అవిశ్వాసం వీగిపోతుందనే ధీమాలో 'గొంగిడి'

చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు పట్టుదలతో ఉన్న కాంగ్రెస్‌నేతలు తమకు అనుకూలంగా ఉన్న 14 మంది డైరెక్టర్లను కేరళలోని ప్రత్యేక శిబిరానికి తరలించారు. క్యాంపులో ఉన్న వీరంతా గురువారం రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారని, శుక్రవారం నేరుగా సమావేశానికి ప్రత్యేక బస్సులో వస్తారని చెబుతున్నారు. సహకార చట్టం నిబంధనల అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే పాలకవర్గ సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేయాలి. ఈప్రకారం మొత్తం 19 మంది డైరెక్టర్లకు 14మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేయాల్సి ఉంటుంది. అవిశ్వాసం నోటీస్‌పై సంతకం చేసిన డైరెక్టర్లు 14 మంది కాంగ్రెస్ శిబిరంలోనే ఉండడంతో అవిశ్వాసం నెగ్గుతుందనే ధీమా కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది. వీరంతా అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేస్తే గొంగిడి మహేందర్‌రెడ్డి చైర్మన్ పదవీచ్యుతులవుతారు. తదుపరి చైర్మన్ ఎన్నికకోసం మళ్లీ 15 రోజుల్లోపు గడువుతో నోటీసులిచ్చి, చైర్మన్ ఎన్నికను నిర్వహించాల్సి ఉంటుంది. డైరెక్టర్లను సమీకరించి గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాస ఘట్టానికి తెరలేపిన డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికే తదుపరి చైర్మన్‌గా అవకాశం దక్కుతుందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ప్రధాన అనుచరుడైన కుంభం ఇప్పటికే తమకు మద్దతుగా ఉన్న డైరెక్టర్లందరితో కలిసి కేరళలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. మరోవైపు డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో కలిసి ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడుతూ డైరెక్టర్లు చేజారకుండా చూసుకుంటూ తనకు అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చుకున్నారు.

అవిశ్వాసం వీగిపోతుందనే ధీమాలో 'గొంగిడి'

డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం వీగిపోతుందనే ధీమా బీఆర్ఎస్‌లో వ్యక్తమవుతోంది. పార్టీ మారనందుకే తమపై కాంగ్రెస్ సీనియర్లు అవిశ్వాసానికి అండగా ఉంటున్నారని, కానీ తమ హయాంలో డీసీసీబీని ముందంజలో ఉంచిన విషయం డైరెక్టర్లందరికీ తెలుసని, వారు తనకు అండగా ఉంటారని, అవిశ్వాసం వీగిపోతుందనే ధీమాలో చైర్మన్ మహేందర్ రెడ్డి ఉన్నారు. అవిశ్వాస తీర్మానంపై సంతకం చేసినప్పటికీ అందులో తమపార్టీకి చెందినవారు ఆరుగురు డైరెక్టర్లున్నారని, వారంతా అవిశ్వాసానికి వ్యతిరేకంగానే ఓటేస్తారని భావిస్తున్నారు. మరోవైపు వైస్ చైర్మన్ సైతం విదేశాల్లో ఉన్నందున ఓటింగ్‌కు హాజరుకాలేరని, కాంగ్రెస్ ప్రోద్బలంతో ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డితోపాటు, డైరెక్టర్లు రంగాచారి, అప్పిరెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఉండగా, విదేశాల్లో ఉన్న వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి ఓటింగ్‌లో పాల్గొనే అంశంపై స్పష్టత రావడంలేదు. ఆయన సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారని, తమకు టచ్‌లోనే ఉన్నారని, అవిశ్వాస ఓటింగ్ సమయానికి వస్తారని తమకు అనుకూలంగా ఓటేస్తారని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తుంటే, ఆయన సమావేశానికి రావడంలేదని, అవిశ్వాసం వీగిపోతుందని బీఆర్ఎస్ నేతలు ప్రకటిస్తుండడంతో ఉత్కంఠ కొనసాగుతోంది.

మిర్యాలగూడలో నాలుగు ఫ్లైఓవర్లు

- ప్రమాదాల నివారణే లక్ష్యం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జూన్ 26: ప్రమాదాల నివారణే లక్ష్యంగా పట్టణంలో నాలుగు ఫ్లైఓవర్లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణం మీదుగా వెళ్తున్న నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిని ఈఎన్‌సీ మధుసూధన్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రాజశేఖర్‌రాజులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల విషయాన్ని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రహదారులకు పరిశీలించేందుకు సంబంధిత అధికారులను పంపడం హర్షనీయమన్నారు. పట్టణంలోని వై.జంక్షన్, నందిపాడు చౌరస్తా, చింతపల్లి బైపాస్, ఈదులగూడ ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సర్వీస్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పట్టణంలో నాలుగు ఫ్లైఓవర్లు నిర్మించతలపెట్టడం హర్షనీయమని మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎంపీ రఘువీర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాదక ద్రవ్యాలరహిత జిల్లాగా మార్చుదాం

● కలెక్టర్ సి.నారాయణరెడ్డి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, జూన్ 26: జిల్లాను మాదక ద్రవ్యాలరహితంగా తీర్చిదిద్దడంలో అందరి సహకారం అవసరమని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సానిక ఎన్జీ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్లాక్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ మానవ జీవితంలో 15 నుంచి 35 ఏళ్లలోపు వయసు చాలా ముఖ్యమైందని, జీవితాన్ని మలుచుకునే ఈ వయస్సులో మాదకద్రవ్యాలకు బానిస కావటంతో జీవితం నాశనమవుతుందన్నారు. ఆలోచనను మందగించే ఏదైనా విషంతో సమానమని, అందువల్ల ఎట్టి పరిస్థితుల్లో యువత మాదకద్రవ్యాలకు అలవాటు కావద్దని, ఒకవేళ వాటికి బానిసైతే జీవితానికి అర్థమే ఉండదన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయించినా, సరఫరా చేసినా వెంటనే పోలీస్ శాఖకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ దీప్తి, రిటైర్డు ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ నాగిరెడ్డి, గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ సక్కుబాయి, డీఎస్పీ శివరాం రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ అమరేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ చైర్మన్ కేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌నుంచి విద్యాశాఖ కార్యక్రమాలపై విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యతను అప్పజెప్పామని, రెండో జత నాణ్యతతో కుట్టి సకాలంలో స్వయం సహాయక సంఘాలు అప్పగించాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు నిర్దేశించిన సమయం ప్రకారం హాజరుకావాలని, ముందస్తు సెలవు లేకుండా ఎట్టి పరిస్థితులలో విధులకు గైర్హాజరు కావద్దని, ఒకవేళ గైర్హాజరైతే సస్పెండ్ చేస్తామన్నారు. కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఈవో భిక్షపతి, డీపీవో మురళి, మిషన్ భగీరథ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూమన్న, టీఎస్ ఎంఐడీసీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా దరఖాస్తులు పరిష్కరించాలి

తప్పుల్లేకుండా ధరణి దరఖాస్తులు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తుకు ఆర్ఎస్ఆర్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎక్కడైనా కుటుంబ తగాదాల కు సంబంధించి సమస్య వస్తే తప్పనిసరిగా ఆధారాలతో సహా నమోదు చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులు వచ్చే శనివారం నాటికి పరిష్కరించాలన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలి

గ్రామస్థాయిలో మహిళాస్వయం సహాయక సంఘాలు ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ అన్నారు. జిల్లా సమాఖ్య భవనంలో పేదరిక నిర్మూలన కార్యక్రమాలపై మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే మహిళా సంఘాలకు పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యతను అప్పగించిందన్నారు. అంతేగాక క్యాంటీన్ల నిర్వహణ, ఇతర వ్యాపారాల వంటి వాటిని సైతం అప్పగిస్తామని, మహిళా సంఘాల సభ్యులు వీటిలో ఇంకా ప్రావీణ్యం సంపాదించి ఆర్థికంగా పైకి రావాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఆర్‌డీవో నాగిరెడి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

జిల్లా ఇంటర్‌బోర్డు అధికారి దస్రునాయక్



కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న దస్రునాయక్

దేవరకొండ, జూన్ 26: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దస్రునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీచేసి మాట్లాడారు. కళాశాలలో వసతులు, గదుల నిర్మాణం, విద్యార్థుల సంఖ్య వివరాలను ప్రిన్సిపల్ మల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రూపులోనూ విద్యార్థుల సంఖ్యను పెంచేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ మల్లయ్యతోపాటు అధ్యాపకులు శ్రీదేవి, నవత, పర్వీన్, వెంకటేశ్వర్లు, సాయిలు, రాజు, నర్సింహ, శ్రీను, పార్థసారధి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మందుల కొరతను నివారించాలి

కనగల్, జూన్ 26: కనగల్ పీహెచ్‌సీలో నెలకొన్న మందుల కొరతను నివారించి, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. బుధవారం కనగల్ పీహెచ్‌సీని ప్రభావతి ఆధ్వర్యంలో ఐద్వా సభ్యురాళ్లు పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులనడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పేదరోగులు చికిత్సకోసం ఆస్పత్రికి వస్తుండగా, ఆస్పత్రిలో సరైన మందులు లేవన్నారు. ఆస్పత్రిలో కనీస వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి అవసరాలకు సరపడా సిబ్బంది నియామకం జరగలేదన్నారు. పేదల వైద్యం పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని అధికారులు వీడాలన్నారు. ఆస్పత్రికి వెంటనే మందులను సరఫరా చేయాలన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

రేషన్ కార్డులొచ్చేనా?



రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. తొమ్మిదేళ్లుగా గత ప్రభుత్వ పాలనలో రేషన్ కార్డులు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో, ఈ ప్రభుత్వంలోనైనా కార్డులొచ్చేనా? అని ప్రజలు నిరీక్షిస్తున్నారు. సుమారు దశాబ్ద కాలంగా జిరాక్స్ కాగితాలను పట్టుకొనే రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీచేసిన తెల్ల రేషన్‌కార్డులు బహుళ ప్రయోజనాల(మల్టీపర్పస్)కు ఉపయోగపడేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ కార్డులు కేవలం నిత్యావసర సరుకుల పంపిణీకి మాత్రమే బీఆర్ఎస్ ప్రభుత్వం పరిమితం చేసింది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి), నల్లగొండ

- జిరాక్స్ కాగితాలతోనే బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు
- కొత్తకార్డుల కోసం వినియోగదారుల నిరీక్షణ
- గతంలో లబ్ధిదారుల వివరాలు సేకరించిన పౌరసరఫరాల శాఖ

గత ప్రభుత్వం రేషన్‌కార్డులను రద్దుచేసి, వాటి స్థానంలో ఆహార భద్రతాకార్డులను పంపిణీ చేయాలని నిర్ణయించింది. కొత్త కార్డుల కోసం లబ్ధిదారులు తొమ్మిదేళ్లుగా వేచిచూస్తున్నారు. కార్డు ఉన్న వారికి కుటుంబంలోని మూడేళ్ల దాటిన వారందరికీ ఆరుకిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఆహారభద్రతాకార్డులుగా పేరు మార్చినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. త్వరలోనే కొత్త కార్డులను పంపిణీ చేస్తామని గత ప్రభుత్వం ప్రకటిస్తూ వచ్చింది. జిల్లాలో మొత్తం 2.16లక్షల ఆహార భద్రతాకార్డులున్నాయి. అయితే తొమ్మిదేళ్లుగా కాగితాలను జిరాక్స్ తీయించుకుని లబ్ధిదారులు బియ్యం, ఇతర సరుకులను తీసుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్డు జారీ ప్రక్రియను వాయిదాలతోనే సరిపెట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వంలోనైనా కార్డులు ముద్రిస్తారా? లేదా? అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ప్రతీనెలా లబ్ధిదారులకు బియ్యం అందిస్తున్నప్పటికీ, కార్డుల జారీలో జాప్యం జరుగుతోంది. గతంలో కుటుంబసభ్యులు సహా అన్నీ డిజిటల్‌కార్డులను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కార్డుల జారీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా కొత్తగా కార్డులు అందుతాయన్న ఆశలో ప్రజలు ఉన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై సమీక్షించి కార్డులజారీతోపాటు సరుకుల పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సి ఉంది.

జిల్లాలో 18వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్

నల్లగొండ జిల్లాలో నిరుపేదలు గత తొమ్మిదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 18,395 మందికి పైగా రేషన్ కార్డులకోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే గత ప్రభుత్వం అనేక సంవత్సరాలుగా రేషన్ కార్డును ఇవ్వని విషయం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వడానికి నిర్ణయించింది. దీంతో నిరుపేదల్లో ఆశలు చిగురుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అమలు చేసే పలు సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ఆధారంగా పథకాలు అమలు చేస్తామని చెప్పింది. అదే విధంగా అనర్హుల రేషన్ కార్డులు తొలగిస్తామని ప్రభుత్వం సంకేతాలు ఇస్తుండటంతో పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఓ వైపు కొత్త కార్డు మంజూరు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం మరోవైపు వివిధ కారణాలతో రేషన్ కార్డులు తొలగిస్తామని స్పష్టం చేస్తుండటంతో ఎవరి కార్డు ఉంటుందో? ఎవరిది పోతుందో? తెలియని పరిస్థితి నెలకొంది. మహిళలకు రూ.2500 నగదు పంపిణీ విషయంలో ఆధార్ కార్డుని ప్రామాణంగా తీసుకున్నారు. అదేవిధంగా ఆరుగ్యారెంటీల పథకం విషయంలోనూ ప్రతీ పథకానికి ఆహార భద్రతకార్డును జోడించాలని సూచించిన విషయం తెలిసిందే. దీంతో కొత్త రేషన్‌కార్డులు అందరికీ అందుతాయా? లేక ప్రభుత్వం వడపోత అవలంబిస్తుందా? అనేది వేచి చూడాల్సింది. ఇప్పటికే గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా రేషన్‌కార్డులు అందక కనీసం బియ్యం కూడా నోచుకోలేమన్న బాధ పేదల్లో ఉంది. ఇక రేషన్ బియ్యం పంపిణీతోపాటు అనేక సంక్షేమ పథకాలు ఆహార భద్రత కార్డు ఉంటేనే మంజూరు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం స్పష్టం చేస్తోంది. మహాలక్ష్మి పథకాలతోపాటు సిలిండర్ రాయితీతో పంపిణీకి రేషన్ కార్డు అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతీ పథకానికి రేషన్ కార్డును అడుగుతుండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు కార్డులేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మంజూరు

రేషన్ కార్డుల విషయమై ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మంజూరు చేస్తాం. సకాలంలో లబ్ధిదారులకు అందజేస్తాం. ఎవరూ ఇబ్బంది పడవద్దని ఓ అధికారి అన్నారు.

గతంలో వివరాల సేకరణ



కొత్త రేషన్‌కార్డులను జారీచేయాలని గతంలో పౌరసరఫరాల శాఖ అధికారులు లబ్ధిదారుల వివరాలు సేకరించారు. కుటుంబ వివరాల పొందుపర్చాల్సిన ప్రొఫార్మాలను రేషన్ డీలర్లకు అందించారు. డిక్లరేషన్ ఫాంలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మండలాలకు పంపారు. జిల్లాలోని రేషన్‌డీలర్ల వారీగా ప్రతీ కుటుంబలోని సభ్యుల ఫొటోలు, వివరాలతో కూడిన ముసాయిదా ఆహార భద్రతా కార్డుల డిక్లరేషన్‌ను తీసుకున్నారు. కుటుంబంలోని సభ్యులందరీ ఫొటోలతో కూడిన వివరాలను సేకరించి అధికారులకు పంపారు. సంబంధిత ప్రొఫార్మాలో ప్రధానంగా కుటుంబసభ్యులు పేర్లు తప్పుగా ఉన్న పక్షంలో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కల్పించారు. ఆహార భద్రతాకార్డుల్లో కొత్త సభ్యులను చేర్చుకోవడం, కుటుంబ సభ్యులు కాని పక్షంలో వారి పేర్లను తొలగించడం, చిరునామా, చౌకధరల దుకాణం మార్పులు తదితర వివరాలు పొందుపరిచేందుకు అవకాశం కల్పించింది. కుటుంబ యాజమాని సెల్‌ఫోన్ నెంబర్లను సేకరించారు. కుటుంబంలోని సభ్యులందరీ పేర్లును నమోదు చేసుకుని పక్కాగా కార్డులు జారీ చేసేందుకు సన్నాహాలు చేసింది. ఆహారభద్రతాకార్డులను మహిళల పేరుపై జారీచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారుల వద్ద వివరాలు సేకరించినప్పటికీ, ఇప్పటివరకు కొత్తగా కార్డులు పంపిణీకాలేదు. దీంతో కొత్తకార్డులు ఎప్పుడొచ్చేనా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

యథేచ్ఛగా ఒండ్రు మట్టి తరలింపు

- పట్టించుకోని అధికారులు
- మేళ్లదుప్పలపల్లి గ్రామంలో వారం రోజులుగా దందా



చెరువు నుంచి ఒండ్రు మట్టిని తెచ్చి, ఇటుక బట్టీల వద్ద పోస్తున్న టిప్పర్

నల్లగొండ రూరల్, జూన్ 26: గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులనుంచి ఒండ్రు మట్టిని ఇటుక బట్టీల వ్యాపారులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మండలంలోని కొంతమంది ఇటుక బట్టీల వ్యాపారులు మండల పరిధిలోని చెరువుల నుంచి ఒండ్రు మట్టిని తవ్వి బట్టీలకు తరలిస్తున్నారు. ఇందుకు మండల, జిల్లా స్థాయి మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారుల అండదండలు పూర్తిస్థాయిలో ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. తవ్వకాలు జరుగుతున్న గ్రామాల్లో కొంతమంది గ్రామస్థులు అడ్డుకుంటుండగా, వారితో చర్చలు జరిపి, గ్రామానికి రూ.2లక్షలు గ్రామ అభివృద్ధికి ఇస్తామని ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ ఒప్పందం మేరకు నెల రోజులు తవ్వకాలు జరుగుతాయని మండల పరిధిలోని మేళ్లదుప్పలపల్లి గ్రామంలో ఈ తతంగం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. మట్టిని తరలించేందుకు మూడు ఎక్స్‌కవేటర్లు, 10 నుంచి 15 ట్రక్కులను వినియోగించినట్లు తెలుస్తోంది. గత వారం రోజులుగా ఇదంతా జరుగుతున్నా ఏ అధికారి అటువైపు చూసిన దాఖలాలులేవు. బుధవారం పట్టణంలోని ఓ నాయకుడు ఇది గమనించి సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులను ఆరా తీయగా, అలాంటిదేమీ లేదని దాట వేశారని తెలిపారు. అప్పటిదాక యథేచ్ఛగా ఒండ్రు మట్టిని తరలించిన టిప్పర్లు 10 నిమిషాల్లో కన్పించకుండాపోయాయని తెలిపారు. ఒండ్రు మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని, కలెక్టర్ ఆదేశించినా యథేచ్ఛగా ఈ తతంగం సాగుతోంది.

బోర్‌బంజార జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

లంబాడ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్



దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

దేవరకొండ, జూన్ 26: జూలై 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే బోర్‌బంజార జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్ గిరిజనులకు పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల హక్కులను పోరాడి సాధించుకున్నట్లు తెలిపారు. బోర్‌బంజార జాతీయ సమ్మేళనంలో రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్‌తో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని గిరిజనుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బోర్‌బంజార సమ్మేళనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. సమ్మేళనానికి గిరిజన విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నేరేడుగొమ్ము ఎంపీపీ వాకునావత్ బిక్కునాయక్, పాపనాయక్, కేతావత్ నాగేశ్వర్‌నాయక్, మూడావత్ లక్‌పతినాయక్, పాండునాయక్, శక్రునాయక్, బాబురాంనాయక్ పాల్గొన్నారు.

డ్రిల్లింగ్ మిషన్‌తో మోది హత్య

● ఎలక్ట్రీషియన్ హత్యకేసును ఛేదించిన పోలీసులు
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 26: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఈ నెల 23న జరిగిన హత్య మిస్టరీని పోలీసులు ఛేదించారు. పని విషయంలో జరిగిన ఘర్షణ హత్యకు దారితీయగా, తోటి కార్మికుడే డ్రిల్లింగ్ మిషన్‌తో హత్య చేసినట్లు డీఎస్పీ రాజశేఖరరాజు వెల్లడించారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో కేసు వివరాలను డీఎస్పీ వివరించారు. నాగార్జునసాగర్ విజయపురికాలనీ పరిధిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో నూతన భవన నిర్మాణంలో స్థానిక హిల్‌కాలనీకి చెందిన సయ్యద్ రెహమాన్ ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నాడు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి పరిధిలోని ఇన్నీస్‌పేటకు చెందిన సిరావు నాగబాలసాయి రెడ్డి భవనం పెయింటింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అయితే పనివిషయంలో సయ్యద్ రెహమాన్, నాగబాలసాయిరెడ్డి మధ్య ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం వివాదం జరిగింది. నాగబాలసాయిరెడ్డి అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో పనిచేసేందుకు స్కూల్ బిల్డింగ్‌లోకి వచ్చాడు. రాత్రి వేళలో నాగబాలసాయిరెడ్డి పెయింటింగ్ వర్క్ చేస్తున్నాడని కన్‌స్ట్రక్షన్ యజమాని నాగేశ్వరరావుకు సయ్యద్ రెహమాన్ ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఆయన తన పని తాను చేసుకుంటాడు నీవు పడుకో.. అని చెప్పడంతో రెహమాన్ నిద్రపోయాడు. తనపై ఫిర్యాదు చేస్తున్న సయ్యద్ రెహమాన్‌పై కక్ష పెంచుకున్న నాగబాలసాయిరెడ్డి అతడిని హతమార్చేందుకు సిద్ధపడ్డాడు. గదిలో ఉన్న ఎలక్ట్రికల్ డ్రిల్లింగ్ మిషన్ రాడ్డుతో రెహమాన్ తలపై విచక్షణ రహితంగా దాడిచేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని స్కూల్ ఆవరణలో గుంతతవ్వి అందులో పూడ్చి అక్కడినుంచి పరారయ్యాడు. ఈ నెల 23వ తేదీన అక్కడకు వచ్చిన యజమాని నాగేశ్వరరావుకు తనతో మాట్లాడిన ఇద్దరు వ్యక్తులు కనిపించకపోవడం, పై అంతస్తులో రక్తపు మరకలు ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన విజయపురి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి జరిపిన సోదాలో మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని గుర్తించారు. దీంతో హత్య కేసు మిస్టరీగా మారడంతో పోలీసులు మూడుబృందాలుగా ఏర్పడి రంగంలోకి దిగారు. నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితుడు పెద్దవూర వై జంక్షన్‌వద్ద ఉన్నట్లుగా గుర్తించి బుధవారం అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

దీంతో విజయపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఇద్దరు వ్యక్తుల మిస్సింగ్ కేసులో ఓ వ్యక్తి హత్యకు గురికాగా, మరో వ్యక్తి నిందితుడిగా పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. పంచనామా నిర్వహించి నిందితుడిపై హత్యానేరం కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. కేసు మిస్టరీని ఛేదించడంలో కృషి చేసిన సాగర్ సీఐ బీసన్న, విజయపురి టౌన్ ఎస్ఐ నారాయణరెడ్డి, సిబ్బంది హరిలాల్, శ్రీకాంత్, గురునాథం పోలీస్ బృందాలను డీఎస్పీ అభినందించారు.

ప్రాణం తీసిన అప్పు

● అప్పుల వారి వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

నాగార్జునసాగర్, జూన్ 26: కుటుంబ అవసరాలు, వ్యాపారం కోసం బంధువుల వద్ద రూ. కోటికిపైగా అప్పు చేశాడు. అప్పు తీర్చాలని బంధువులు ఒత్తిడి చేయడం ప్రారంభించారు. ఏమి చేయాలో అర్థం కాలేదు.. అప్పులు తీర్చే మార్గం లేక ఉరివేసుకుని తనువు చాలించాడు. బుధవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కండెల శంకరయ్య(35) నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో నివాసం ఉంటాడు. పందుల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. పందులు కొనుగోలు చేసి విక్రయించేవాడు. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని తన చెల్లెలి భర్త(బావ), బావ సోదరి(వదిన) వద్ద రెండేళ్లలో రూ.కోటి తీసుకున్నాడు. తమకు డబ్బులు కావాలని వారు ఒత్తిడి చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో జూలై 5వ తేదీలోపు అప్పు తిరిగి ఇవ్వాలని బంధువులు ఒత్తిడి చేస్తున్నారు. పది రోజులుగా ఈ పంచాయితీ నడుస్తోంది. అయితే ఈ నెల 24వ తేదీ సోమవారం శంకరయ్యను అప్పు ఇచ్చిన బంధువులు ఏపీలోని మాచర్లలో పట్టుకుని, అక్కడినుంచి గజ్వేల్‌కు తీసుకెళ్లారు. అక్కడ శంకరయ్యపై అతని బంధువులు దాడి చేసినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శంకరయ్య మంగళవారం రాత్రి హిల్‌కాలనీలోని తన ఇంటికి చేరుకున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన శంకరయ్య సూసైడ్ నోట్ రాసి ఇంట్లో పెట్టి గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. బుధవారం ఉదయం భార్య ఉదయం ఆరు గంటల సమయంలో నిద్రలేచి చూసే సరికి శంకరయ్య ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతుండంతో ఆమె వెంటనే చుట్టు పక్కల ఉన్న బంధువులను పిలిచింది. శంకరయ్యను కిందకు దించగా అప్పటికే మృతిచెందాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సూసైడ్ నోట్, శంకరయ్య(ఫైల్)

సూసైడ్ నోట్ స్వాధీనం

పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో లభించిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ తనను వేధిస్తున్నారని, కోటి రూపాయల అప్పుకు మరో కోటి రూపాయలు వసూలుచేస్తూ దందా చేస్తున్నారని లేఖలో రాసి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శంకరయ్య సోదరుడు నారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శంకరయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు.

ఒడిశా టూ షోలాపూర్ గంజాయి రవాణా

● అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల ముఠా అరెస్టు
● సీట్ల కింద భాగంలో గంజాయి... వాటిపై వస్త్రం

చౌటుప్పల్ రూరల్, జూన్ 26: ఒడిశా నుంచి షోలాపూర్‌కు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల ముఠాను రాచకొండ ఎల్‌బీనగర్ జోన్ ఎస్ఓటీ, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు అరెస్టుచేశారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో 284కిలోల ఎండు గంజాయి, రెండు కార్లు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఈ కేసు వివరాలను రాచకొండ సీపీ తరుణ్‌జోషి రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన బోసాలే అబమశ్చేంద్ర(29), అవినాష్ శివాజీ రాథోడ్ (19), సిద్ద రామేశ్వర్ పూజారి(27) డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. అజయ్‌రాథోడ్ అనే మిత్రుడితో కలిసి గతంలో గంజాయి రవాణాతో డబ్బులు సంపాదించారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి షోలాపూర్‌కు గంజాయిని తరలించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ నెల 23వ తేదీన పై నలుగురు ఒడిశాలోని అల్లూరి కోటలో ఉన్న గంజాయి విక్రయదారుడు తేజ వద్ద గంజాయి కొనుగోలు చేశాడు. అజయ్‌రాథోడ్ అక్కడే ఉండి ముగ్గురికి ఇన్నోవా, స్విఫ్ట్ డిజైర్ కార్లను సమకూర్చాడు. రెండు కార్లలో 140 బ్యాగుల ఎండు గంజాయిని తీసుకుని బయలుదేరారు. సీట్ల కింద భాగంలో, గంజాయిని అమర్చి, వాటిపై వస్త్రం కప్పారు. మహారాష్ట్రకు చెందిన ఇన్నోవా కారు నెంబర్ ప్లేటును ఏపీ నెంబర్ ప్లేటు నకిలీది ఏర్పాటు చేసుకుని ఈ నెల 24వ తేదీ రాత్రి ఒడిశా నుంచి విజయవాడ, సూర్యాపేట మీదుగా షోలాపూర్‌కు బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, చౌటుప్పల్ పోలీసులు ఈ నెల 25వ తేదీన పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఇన్నోవా వాహనాన్ని తనిఖీ చేశారు. ముగ్గురు నిందితులను ఆదుపులో తీసుకుని వారి నుంచి రూ.80.30లక్షల విలువైన గంజాయి, కార్లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. తేజ, రాథోడ్‌లు పరారీలో ఉన్నట్లు రాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపారు.


పంతంగి టోల్‌గేటు వద్ద గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డ కారు

సోనియాతో ఉత్తమ్ భేటీ

డిల్లీలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించడంపై ఆయన అభినందనలు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ గురుతర బాధ్యతలు తీసుకున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



గుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూన్ 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో, పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 19,74,929 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. ఈ నెల 27నుంచి స్వామివారి సన్నిధిలో శ్రీవినాయక నాట్యమండలి సురభి నాటకాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు. యాదాద్రీశుడిని దర్శించుకున్న భక్తులు సమర్పించిన మొక్కు కానుకలను గురువారం లెక్కించనున్నారు. కొండకింద వ్రత మండపంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు.



పోలీసులు వేధిస్తున్నారంటూ
ఆత్మహత్యాయత్నం

వాడపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఘటన


సైదాను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

దామరచర్ల, జూన్ 26: పోలీసులు తనను వేధిస్తున్నారంటూ నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట తాజా మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దామరచర్ల మండలం గణేష్‌పహాడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రమావత్ జ్యోతి భర్త సైదా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నాడు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మే 13వ తేదీన అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తనపై దాడి చేసి గాయపరిచారని అదేరోజు సైదా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకున్నారో లేదో తెలుసుకునేందుకు సైదా బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఎస్ఐ లేరని తెలుసుకున్న అనంతరం బయటకు వెళ్లిన సైదా పోలీస్‌స్టేషన్ వెనుకవైపు ఉన్న రోడ్డు వద్ద ఓ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అందులో తనపై దాడి చేసిన వారి వివరాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని, పైగా తనపైనే కేసు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నాడని, తాను ఆత్మహత్య చేసుకుంటానని క్రిమిసంహారక మందు డబ్బాను చూపించాడు. ఈ వీడియోను పలు సోషల్‌మీడియా గ్రూపుల్లో పోస్ట్ చేసి ఆ వెంటనే పోలీస్‌స్టేషన్ ఎదుట క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన స్థానికులు పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు పోలీస్ వాహనంలో సైదాను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా సైదా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సమయంలో ఎస్ఐ ఇరుగు రవి మిర్యాలగూడకు ట్రైనింగ్ నిమిత్తం వెళ్లాడు.

సైదావి తప్పుడు ఆరోపణలు : ఎస్ఐ ఇరుగు రవి

పోలీసులపై సైదా చేస్తున్న ఆరోపణలు నిరాధారమని ఎస్ఐ తెలిపారు. గతంలో గ్రామంలో నీటి సరఫరా చేసే వ్యక్తిని సైదా దూషించడంతో అతడు దాడిచేశాడని, ఆ ఘటనలో సైదాకు స్వల్పగాయమైందన్నారు. ఈ ఘటనపై ఇరువురు ఫిర్యాదు చేసుకోగా, దూషించినందుకు సైదాపై, దాడి చేసినందుకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. సైదాను ఏ రోజూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడం కానీ, వేధించడం కానీ జరగలేదన్నారు. గ్రామంలో నీటి సమస్యపై చర్చిస్తున్న సమయంలో ఘర్షణ జరిగిందని, సైదా గొడవకు సంబంధించి ఏ పార్టీతోనూ సంబంధం లేదన్నారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

» సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్‌ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబంధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

» 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ ఛైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

» మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం

» బీఆర్‌ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజూరాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

» తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్‌ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

» మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం

» పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి

» ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

» త్వరలోనే బీఆర్‌ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్‌ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో విస్కీలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

» ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

» కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి

» పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం కాదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్‌ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

» యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి

» మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

» కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా

» ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం

» కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్‌ఎస్‌లో ఉన్నడు

» నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదా యం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమీద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయ్యుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తనదన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

» 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు

» ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కాహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

» ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్‌ఎస్ నేత?

» ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్‌ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్‌ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్‌ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్‌ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్ల, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.



కనగల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



మిర్యాలగూడలో ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



గుర్రంపోడులో మాట్లాడుతున్న ఎస్‌ఐ శివప్రసాద్



అడవిదేవులపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

మత్తుకు బానిస కావొద్దు

వేములపల్లిలో..





డిండిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కొండమల్లేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



హాలియాలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



చండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



దేవరకొండలో మాట్లాడుతున్న డీఎస్పీ గిరిబాబు



కట్టంగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నిడమనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



తిప్పర్తిలో మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు

● మిర్యాలగూడ నియోజకవర్గాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తీసుకున్న కఠిన నిర్ణయాలతో డ్రగ్స్ మాఫియా పలాయనం చిత్తగించిందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎంఈవో బాలాజీనాయక్ పాల్గొన్నారు. పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

● దేవరకొండలో స్పోర్ట్స్ అసోసియేషన్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, దేవరకొండ సీఐ నర్సింహ, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు వెంకటయ్య, సైదులు, రమేష్ ఉన్నారు.

● అడవిదేవులపల్లిలో ఎస్‌ఐ శేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

● మాడ్గులపల్లిలో విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. డ్రగ్స్ అమ్మినా, సేవించినా చర్యలు తప్పవని ఎస్‌ఐ జి.శోభన్‌బాబు హెచ్చరించారు.

● దామరచర్లలో ఎస్‌ఐ ఇరుగు రవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

● చిట్యాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సైదాబాబు, ఎంఈవో నర్సింహ్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం గోగికార్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తిలోని మోడల్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ డి. రాజు, ఏఎస్‌ఐ రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో ఎస్‌ఐ ఎన్. అంతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

● నిడమనూరులో అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాల్‌రావు, ఏఎస్‌ఐలు జోజి, రమేష్, ఉన్నం చినవీరయ్య, ఈశ్వర్, మహేష్, నాగయ్య పాల్గొన్నారు.

● డిండిలో ఎస్‌ఐ రాజు, మునుగోడులో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

● కొండమల్లేపల్లిలో కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, ఎస్‌ఐ రామ్మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● హాలియాలో హాలియాలో సీఐ జనార్ధన్‌గౌడ్, మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.ఐ. సతీష్‌రెడ్డి, నాయకులు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, పిల్లి ఆంజనేయులు, చింతల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్)లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నారాయణరెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్, ఏఎస్‌ఐ భిక్షమయ్య, పాల్గొన్నారు.

● వేములపల్లిలో ఎస్‌ఐ విజయ్‌కుమార్, మునుగోడులో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ఉపేందర్, పాల్గొన్నారు. ● కనగల్‌లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామక్రిష్ణగౌడ్, రమేష్‌నాయక్, బుర్హాన్, నజీర్ న్నారు.

● శాలిగౌరారంలో వైద్యాధికారులు సూర్య శిల్ప, వాసవి, గుర్రంపోడులో ఎస్‌ఐ శివప్రసాద్, చండూరులో ఎస్‌ఐ సురేష్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ఆత్మగౌరవం కోసం పోరాడాలి : రాజయ్య



మాట్లాడుతున్న రాజయ్య

నల్లగొండ టౌన్, జూన్ 26: మాదిగల ఆత్మగౌరవం, ఉనికిని చాటేందుకుగాను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రారంభమైందని తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. నల్లగొండలో తెలంగాణ మాదిగ సైన్యం కార్యాలయాన్ని రిజర్వేషన్ ఫలాలు అందేదాకా అనేక సంఘాలు, వేదికల ద్వారా మాదిగ రిజర్వేషన్ పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రారంభించారు. మాదిగల ఉనికి, ఆత్మగౌరవం అస్తిత్వం కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ సైన్యం వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల రవి మాదిగ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జంపాల జానయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాణి, బాబు, కుర్తాల నాగరాజు, లలిత, మహేష్, కమల, స్వప్న, శోభ, శివ, గిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 26: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఇరిగేషన్, విద్య, వైద్యం, వ్యవసాయంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. వానా కాలం సీజన్‌లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈవో తరి రాములు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీపీ కొలను సునీత అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. వెల్మినేడులో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను నిలిపివేయాలని, మిషన్ భగీరథ పనులను పూర్తిచేయాలని సభ్యులు కోరారు. చివరి సమావేశం కావడంతో పాలకవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుంకరి ధనమ్మ, వైస్ ఎంపీపీ మర్ల అలివేలు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్యయాదవ్, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, ఎంపీడీవో జయలక్ష్మి, తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి విద్యుత్ థర్మల్‌ప్లాంట్‌లో వైద్య శిబిరం

దామరచర్ల, జూన్ 26: మండలంలోని యాదాద్రి విద్యుత్ థర్మల్ ప్లాంట్‌లో బుధవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి మాట్లాడుతూ ప్లాంట్‌లోని 464 మంది కార్మికులకు ఐదు వైద్య బృందాలతో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్మికుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

శాలిగౌరారం, జూన్ 26: తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లోని కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గురజాల మాజీ సర్పంచ్ మారం వేణుగోపాల్‌రెడ్డికి గుండె ఆపరేషన్ కావడంతో బుధవారం పరామర్శించారు. అనంతరం మనిమద్దె గ్రామంలో ఒక్కరోజు వ్యవధిలోనే మృతిచెందిన తండ్రీ,కొడుకు కుటుంబాలను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడిపాటి నర్సయ్య, ఎంపీటీసీ నక్క శంకరమ్మ మల్లేష్ ఉన్నారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

నల్లగొండ టౌన్, జూన్ 26: కేంద్ర ప్రభుత్వ పరిధిలో నిర్వహించిన నీట్ ప్రశ్నాపత్రాల లీక్ కారకులను శిక్షించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తీరుపారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పరీక్ష ఫలితాలను రద్దు చేసి, మళ్లీ పరీక్షలు నిర్వహించాలన్నారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన 24లక్షల మంది విద్యార్థులు భవితవ్యాన్ని గందగోళంలో పడేశారని విమర్శించారు. పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షడు బూడిద సురేష్, సహాయ కార్యదర్శి షరీఫ్, ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్, పులికరం ఆంజనేయులు, రాజు, రమేష్ పాల్గొన్నారు.

రూ.4.92 కోట్ల బడ్జెట్‌కు నందికొండ కౌన్సిల్ ఆమోదం

నాగార్జునసాగర్, జూన్ 26: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మునిసిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ అన్నారు. బుధవారం జరిగిన నందికొండ మునిసిపాలిటీ 2024-25 వార్షిక బడ్జెట్ సమావేశంలో మాట్లాడారు. మునిసిపాలిటీ పరిధిలోని ఉన్న హిల్‌కాలనీ, పైలాన్ కాలనీల్లో మౌలిక వసతుల కోసం రూ.4.92 కోట్లతో వార్షిక బడ్జెట్‌లో మొత్తం 42 రకాల పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మొత్తం 11 మంది కౌన్సిలర్‌ల్లో 9 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు హాజరయ్యారు. ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీను, వైస్ చైర్మన్ నాగరాణి, ఏఈ వెన్‌కుమార్, కౌన్సిలర్‌లు మంగ్త నాయక్, రఘువీర్, నాగశిరిష, రమేష్‌జీ, మోహన్‌రావు పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలిస్తున్న టిప్పర్లు, డోజర్లు సీజ్

మిర్యాలగూడ రూరల్, జూన్ 26: మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలోని చెరువు మట్టిని అక్రమ వెంచరకు తరలిస్తున్న మూడు టిప్పర్లను, రెండు డోజర్లను అధికారులు బుధవారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా చేపట్టి వెంచర్‌కు అదే గ్రామ పరిధిలోని చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని జిల్లా ఉన్నతాధికారులు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ హరిబాబు, ఆర్‌ఐ సత్యనారాయణలు గ్రామానికి చేరుకొని గుడిపాటి శ్రీనివాస్‌కు చెందిన వెంచర్‌లో చెరువు మట్టిని చదును చేస్తున్న డోజర్లు, టిప్పర్లను బుధవారం సీజ్ చేశారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

పెద్దఅడిశర్లపల్లి(చింతపల్లి),జూన్26: మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన ఘటన చింతపల్లి మండలంలో బుధవారం జరిగింది. చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం కుర్మేడ్‌కు చెందిన దంపతులు గోరేటి బక్కమ్మ, నర్సింహ పత్తిగింజలు నాటారు. పొలం వద్దకు వెళ్లి ఇంటికి వస్తుండగా విరాట్‌నగర్‌కాలనీ సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మాటమాట కలిపి బక్కమ్మ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు అపహరించారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్, జూన్ 26: కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ మునిసిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. జీవో 1037లో ప్రతిపాదించిన మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పజెప్పాలని నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్లు తెలంగాణలో కూడా రూ.21వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాంకీ తదితర ప్రైవేట్ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కొత్తగా నియమించిన కార్మికులకు పాత కార్మి కులతో సమానంగా వేతనాలు పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాల న్నారు. ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు దండెంపల్లి సత్తయ్య, నల్ల వెంకటయ్య, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండమల్ల శ్రీనివాస్, నాయ కులు పెరిక కృష్ణ, కత్తుల సైదులు, యేసు, తారమ్మ, కొత్తపల్లి జంగయ్య ఎస్కే జానీ, నరసింహ, వెంకట్‌రెడ్డి, నరసమ్మ, శోభ, చంద్రమ్మ, సైదమ్మ, పద్మ, నాగరాజు, లింగయ్య పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు



నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, జూన్ 26: నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను కోరారు. మండలకేంద్రంలోని ఎస్‌ఎస్‌పీ కాల్వ సమీపంలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి బుధవారం పరిశీలించారు. రహదారి వెంట సర్వీస్ రోడ్డు లేక గ్రామాల్లోని ప్రజలు రోడ్లపై ప్రయాణించే క్రమంలో ప్రమాదాలకు గురై మృత్యువాత పడడం బాధాకరమన్నారు. ఇకపై ఏ ఎవరూ ప్రమాదాలకు గురికాకుండా తక్షణమే సర్వీస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని గ్రామస్థులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ, ఎన్‌హెచ్‌ఏ, ఆర్‌అండ్‌బి అధికారులు ఉన్నారు.

వెంకట్‌రెడ్డికి వైద్యరత్న అవార్డు

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 26: మండలకేంద్రానికి చెందిన డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి వైద్యరత్న జాతీయ అవార్డు లభించింది. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బుధవారం జరిగిన బహుజన రైటర్స్ ఇండియా కార్పరెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ నుంచి అవార్డును అందుకున్నారు. గ్రామాల్లో నిరుపేదలకు ఉచిత వైద్య సేవలకు గుర్తించి అవార్డును అందజేసినట్లు నిర్వహకులు తెలిపారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముందుముందు పేద ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తూ సేవ కార్యక్రమాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో బహుజన అకాడమీ నిర్వహకులు పాల్గొన్నారు.

బ్రహ్మచారికి సేవారత్న అవార్డు

మిర్యాలగూడ టౌన్, జూన్ 26: పట్టణానికి చెందిన ఎలక్ట్రీషియన్ నారాబత్తుల వెంకటనాగబ్రహ్మచారి సేవారత్న జాతీయ అవార్డు అందుకున్నారు. సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న బ్రహ్మచారిని బహుజన సాహిత్య అకాడమీ, నేషనల్ కమ్యూనిటీ ఆఫ్ ఇండియా ఈ అవార్డుకు ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో జరిగిన కార్య క్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ నుంచి అవార్డు అందుకున్నారు.

భారతదేశంలో కుల నిర్మూలన జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకుడు స్కైలాబ్

నల్లగొండ రూరల్, నల్లగొండ టౌన్, జూన్ 26: దేశంలో కుల నిర్మూలన జరగాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపెట్ట స్కైలాబ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ ట్రస్ట్ భవనంలో కేవీపీఎస్ జిల్లాస్థాయి సామాజిక శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. దేశంలో 6,486 కులాలు ఉండగా అందులో 28వేల ఉపకులాలు ఉన్నాయన్నారు. తరతరాలుగా మనస్మృతి మనుధర్మ శాస్త్రం ఆధారంగా మనిషిని మనిషిగా చూసే పరిస్థితి లేదన్నారు. కులం పేరిట దాడులు దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై దాడులు దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులకు ఇచ్చిన హామీలు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు ఇళ్లు, ఇళ్ల స్థలాలు విదేశీ విద్యా నిధి పథకం ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అధ్యతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పరుశరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్, బొల్లు రవీందర్, పెరికే విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



సత్యనారాయణ, వెంకటాచారి, భిక్షం

శాలిగౌరారం, జూన్ 26: శాలిగౌరారం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగాడెంకల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మారోజు వెంకటాచారి, కోశాధికారిగా వడ్లకొండ భిక్షం, ఉపాధ్యాక్షులు-1 చామల మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు-2 రాపాక రాజు, సలహాదారులు రామడుగు వెంకట్రామశర్మ, ఆకవరం అశోకచారి, నిమ్మల ఆంజనేయులు, లీడర్‌షిప్ మెంబర్‌గా గుజలాల్ శేఖర్ బాబు, చిర్రబోయిన శ్రీనివాస్, సర్వీస్‌మెంబర్‌గా బచ్చు ఆంజనేయులు, మార్కెటింగ్ మెంబర్‌గా మొరారిశెట్టి కరుణాకర్, ఎక్స్ టెన్షన్ మెంబర్‌గా యంగలి రామకృష్ణ, మహిళా ప్రతినిధిగా యారాల పద్మ, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా మారం వేణుగోపాల్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎర్ర శంభులింగారెడ్డి, రావిరాల అశోక్, బాణాల రాంరెడ్డి, గంట అంజిరెడ్డి, బుడిగె శ్రీనివాసులు ఉన్నారు.

దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలి

నల్లగొండ టౌన్, జూన్ 26: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వచ్చే నెల 27వ తేదీన నిర్వహించనున్న దండోరా రజితోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల తులసీదాస్ కోరారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం కరపత్రాలు ఆవిష్కరించారు. మాదిగల హక్కుల సాధన కోసం చేపట్టిన ఉద్యమానికి 30సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో రజితోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మా ర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజి సైదులు, నాయకులు మేడి నర్సింహ్మ, నూకపంగ కాశయ్య, భూషిపాక నర్సింహ్మ, పోదెం సహదేవులు, పోలేపల్లి సత్యనారాయణ, కాశయ్య, ఇంద్రవెల్లి శ్రీనివాస్, పరంగి రంజిత్, సందే యేసు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతులు కల్పించాలి

నల్లగొండ టౌన్, జూన్ 26: ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్ అన్నారు. పాఠశాలల్లో వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ కన్వీనర్ శివమణి, సోషల్ మీడియా కన్వీనర్ జయేందర్, ఎన్జీ కళాశాల అధ్యక్షుడు మణి, శివకృష్ణ, పవన్ పాల్గొన్నారు.

చింతపల్లి: మాల్, చింతపల్లిలలో విద్యాసంస్థలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివకృష్ణ, సందీప్, కార్తీక్, ప్రశాంత్ ఉన్నారు.

దేవరకొండ: దేవరకొండలో ఏబీవీపీ నాయకులు తరగతులు బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యలమల గోపిచంద్, శ్రీకాంత్, హేమసుందర్, భరత్, అరవింద్, మహేందర్, శ్రీహరి, సైదులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు బొల్లేపల్లి మధుమోహన్‌రాజు, పగిడిపల్లి శ్రీకాంత్, కీరిత్రత, మల్లీశ్వరి, నాగరాజు, పార్థసారధి, వంశీ, రాజు, రాకేష్, రవి, మధు, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు నీటి సరఫరాలో అంతరాయం

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 26: హైదరాబాద్ మహానగరానికి నీటిని సరఫరా చేసే కృష్ణాజలాల నీటి సరఫరా స్కీమ్ ఫేజ్-2లోని కోదండాపురం పంప్‌హౌస్‌లో రెండో పంపు ఎన్‌ఆర్‌వీ వాల్వ్ మరమ్మతులకు గురైంది. దీంతో అత్యవసరంగా నీటిసరఫరా నిలిపివేసినట్లు మెట్రో వాటర్ బోర్డు బుధవారం అధికారులు తెలిపారు. దీంతో గురువారం, శుక్రవారం హైదరాబాద్ మహానగరానికి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు జరుగుతున్నాయని, పనులు పూర్తి అయిన వెంటనే యథావిధిగా నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ మిగులు భూమి అక్రమణపై విచారణ

మునుగోడు, జూన్ 26: మునుగోడులో చేనేత సంఘం ఆధీనంలోని ప్రభుత్వ మిగులు భూమిని అక్రమార్కులు రిజిస్ట్రేషన్ చేసుకొన్న వ్యవహారంపై డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు బుధవారం విచారణ నిర్వహించారు. గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం భూమిని సందర్శించారు. చేనేత కార్మికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో స్వరూప రాణి, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, చేనేత అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు ఉన్నారు.

ఛత్రపతి సాహు మహారాజ్ ఆశయ సాధనకు కృషిచేయాలి

దేవరకొండ, జూన్ 26: బహుజన సమాజం కోసం, సమ సమాజ స్థాపన కోసం కృషిచేసిన ఛత్రపతి సాహు మహారాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంభాలపల్లి వెంకటయ్య అన్నారు. దేవరకొండలో ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సాహు మహారాజ్ 150వ జయంతి నిర్వహించారు. విద్యా, వైద్యం పేదలకు అందించిన మహనీయుడు సాహు మహారాజ్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు, అంకూరి మోషె, అరేకంటి మైసయ్య, నజీర్, శేఖర్, పాల్గొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 26: లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభిరాం కోరారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా భీమా పొందవచ్చన్నారు. ఆహార భద్రత కార్డు కలిగిన వారందరూ ఈ పథకానికి అర్హులేనని, 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దామరచర్ల, జూన్ 26: మిర్యాలగూడ 220కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు 220కేవీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ అబ్దుల్లా హబీబ్ బుధవారం తెలిపారు. మరమ్మతుల కారణంగా మండలంలోని నూనావత్‌తండా సబ్‌స్టేషన్ పరిధిలోని నూనావత్‌తండా, రాళ్లవాగుతండా, కొండ్రపోల్, కేశవాపురం ఫీడర్లలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

కొండమల్లేపల్లి, జూన్ 26: మండల పరిధిలోని చింతచెట్టుతండా, జేబీకి వెళ్లే రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారిందని, ఈ మేరకు గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి రమేశ్ ఎంపీడీవో రాంరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు.

ఎంపీ రఘువీర్‌ను సన్మానించిన నాయకులు

హాలియా, జూన్, 26: నల్లగొండ ఎంపీఆగా ప్రమాణస్వీకారం చేసిన కుందూరు రఘువీర్‌రెడ్డిని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ బుధవారం సన్మానించారు. ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తెలంగాణ భవన్‌లో ఎంపీని కలిశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్‌నాయక్, సాగర్, దేవరకొండ నియోజకవర్గాల అధ్యక్షులు పగడాల నాగరాజుయాదవ్ ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్‌కు ప్రీ స్కూల్ శిక్షణ

హాలియా, జూన్, 26: అనుముల ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీవో గంధం పద్మావతి అధ్యక్షతన బుధవారం రెండో రోజు ప్రీ స్కూల్ శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ శిక్షణను నేర్చుకొని గ్రామాల్లో పిల్లల్లో మార్పు తీసుకురావాలన్నారు. పిల్లల సంఖ్య పెంచుకునేలా చూడాలన్నారు. మిర్యాలగూడ సీడీపీవో మమత, సూపర్‌వైజర్ నజీమా మాస్టర్ ట్రైనర్లుగా అంగన్‌వాడీ టీచర్లకు అంగన్‌వాడీ బడిబాట, జూన్ నెల టైం టేబుల్, పూర్వ పఠన- పూర్వ లిఖిత భావనలు, పోర్ట్ పోలియోలు, పూర్వ గణిత భావనలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ రమాదేవి, సరిత, సైదాబేగం, నాగమణి, వెంకాయమ్మ, యాదమ్మ, విజయలక్ష్మి, గౌసియాబేగం, రాజరాజేశ్వరీ, కవిత, బీసీ పవన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భూపతి బక్కమ్మ అకాల మృతి బాధాకరం

శాలిగౌరారం, జూన్ 26: అడ్లూరు గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు భూపతి అంజయ్య మాతృమూర్తి బక్కమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఎమ్మెల్యే మందుల సామేలు అడ్లూరుకు చేరుకుని బక్కమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు గుణగంటి శంకర్, తీరుపారి మల్లేష్, పాకాల సతీష్, నక్క మల్లేష్, మంగదుడ్ల శ్రీనివాస్, శ్రీను, పెరుమాండ్ల నరేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

త్రిపురారం, జూన్ 26: మిర్యాలగూడ సబ్‌స్టేషన్ 220కేవీ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు త్రిపురారం మండలంలోని 33కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ మండలంలోని అన్ని గ్రామాలు, త్రిపురారం మండలంలోని నాలుగు సబ్‌స్టేషన్లు త్రిపురారం, నీలాయగూడెం, మాటూరు, పెద్దదేవులపల్లి ఫీడర్ల కింద ఉన్న అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి వెంకట్‌రెడ్డి ఆర్థిక సాయం

కనగల్, జూన్26: మండలంలోని ఇస్లాంనగర్ గ్రామానికి చెందిన షేక్‌నజీర్ రాయికొట్టే పనులు చేస్తూ ప్రమాదవశాత్తు తలకు గాయమై మృతిచెందాడు. మంత్రి వెంకట్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని ప్రకటించి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ ద్వారా బాధిత కుటుంబానికి పంపించారు. కార్యక్రమంలో నాయకులు చిలకరాజు వెంకన్న, రాజురెడ్డి, దొడ్డి సైదులు, మురళి, శ్రీశైలం, ఖాదర్ పాల్గొన్నారు.